జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 34 11-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06







# పురపోరులో సత్తా చాటుతాం

- మల్లికార్జున ఖర్గేకు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తామని వెల్లడి
- అదే ఊపుతో ముందుకెళ్లాలన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- రాష్ట్ర రాజకీయాలపై నేతల చర్చ



మిగతా 2లో



# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి

# రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

- ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం
- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ
- గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి

10లో





# భరతమాతనే... అమెరికాకు అమ్మేశారు

- కేంద్రంపై విరుచుకుపడ్డ రాహుల్
- అగ్ర రాజ్యానికి పూర్తిగా లొంగిపోయింది
- వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో నిప్పులు
- మోదీ సర్కారుకు కాస్తయినా సిగ్గుగా లేదా?
- ఒప్పందాన్ని ఎలా సమరి?థంచుకుంటుంది?
- ప్రధానిని అమెరికా మెడలు పట్టి వంచేసింది
- ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్లకు లొంగారు
- బీజేపీ ఆర్థిక ప్రయోజనాలకే పెద్దపీట వేశారు

2లో



# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు... ఎగ్జిట్ పోల్స్

2లో

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా
- దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ
- బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు
- నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- ఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

# శాంతిభద్రతలను కాపాడండి

- బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పోడియం వద్ద నిరసన
- రాష్ట్రంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం
- అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు
- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ప్రజలను మోసం చేశారు
- నిరుద్యోగ భృతి ఇస్తామంటూ యువతను దగా చేశారు



# గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

- గవర్నర్ ప్రసంగం అవాస్తవాలు, కల్పితాలతో నిండిన డొల్ల పత్రం అని షర్మిల విమర్శ
- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపణ
- పోలవరం ఎత్తు తగ్గించి, ఆరోగ్యశ్రీని చంపేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు



# నేను జోక్యం చేసుకోకపోతే అది అణు యుద్ధంగా మారేది

- భారత్, పాక్‌లపై టారిఫ్‌ల హెచ్చరిక బాగా పనిచేసింది
- రెండు దేశాల ఘర్షణలో 10 యుద్ధ విమానాలు నేలకూలాయి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# నేను జోక్యం చేసుకోకపోతే అది అణు యుద్ధంగా మారేది

వాషింగ్టన్: గత ఏడాది భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే చొరవ తీసుకొని ఆపేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఒకవేళ తాను స్పందించకపోతే అది కచ్చితంగా అణుయుద్ధంగా మారేదని, టారిఫ్‌ల యుద్ధం జరిగేదని అన్నారు. ట్రంప్ మంగళవారం ఓ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. తాను రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలకు ముగింపు పలికానని చెప్పారు. ఇందులో ఆరు యుద్ధాలు టారిఫ్‌ల బెదిరింపు వల్ల ఆగిపోయానని తెలిపారు. మాట వినకపోతే మీ ఉత్పత్తులపై భారీగా టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో ఆయా దేశాలు దారికొచ్చాయని పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా సామాన్య ప్రజలు మరణించడం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదన్నారు. టారిఫ్‌ల భయంతో భారత్, పాకిస్తాన్‌లు యుద్ధం నిలిచివేశాయని వెల్లడించారు. ఇరుదేశాల ఘర్షణలో కనీసం 10 యుద్ధ విమానాలు నేలకూలాయని తెలియజేశారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి ట్రంప్ బయటపెట్టలేదు. యుద్ధాన్ని ఆపడం ద్వారా కనీసం కోటి మందిప్రజల ప్రాణాలను ట్రంప్ రక్షించారని అప్పట్లో పాకిస్తాన్ ప్రధానమంత్రి చెప్పినట్లు గుర్తుచేశారు. తాను గనుక కలుగజేసుకోకపోతే భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధం జరిగేదని ట్రంప్ తేల్చిచెప్పారు. టారిఫ్‌ల హెచ్చరిక బాగా పనిచేసిందని వ్యాఖ్యానించారు. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపేశానంటూ ట్రంప్ చెప్పుకోవడం ఇది 80వ సారి కావడం గమనార్హం.

## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

ప్రతిపక్ష నేతగా జగన్ విఫలమయ్యారని, దమ్ముంటే రాజీనామా చేయాలని డిమాండ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లగా, అవాస్తవాలు, కల్పితాలతో నిండి ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు కొన్ని మెరుగులు దిద్ది చదివినట్లుగా ఉందని, రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి దశ, దిశ లేదని ఆమె ఎద్దేవా చేశారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి పాలనపై విజన్ గానీ, విజ్ఞత గానీ లేవని, సుపరిపాలన, సమతూకం మచ్చుకైనా కనిపించడం లేదని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని షర్మిల విమర్శించారు. రూ. 33 వేల కోట్లతో వాటిని అమలు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా బూటకమని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న నిరుద్యోగ భృతి హామీ అడ్రస్ లేకుండా పోయిందని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది విద్యార్థులను, అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని, గోడ క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చే ఆడబిడ్డ పథకానికి దిక్కులేదని, కానీ 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి దానిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో చంపేశారని, 1.43 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అనేవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత అంటూ డ్రామాలు ఆడుతున్నారే తప్ప చేతల్లో అది కనిపించడం లేదని అన్నారు. కిలో రూపాయికి టమాటో, ఉల్లి అమ్ముకుంటున్న రైతులను పట్టించుకోకుండా, మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఆదుకున్నామని చెప్పడం దారుణమని ఆమె పేర్కొన్నారు.

## శాంతిభద్రతలను కాపాడండి


అమరావతి: రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతి భద్రతలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఎదుట నినదించింది. రాష్ట్రంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని రంగాల్లో చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి మోసం చేశారని మండిపడింది. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలూ సంతోషంగా లేరని నిప్పులు చెరిగింది. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మూకుమ్మడిగా ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఉదయం ర్యాలీగా అసెంబ్లీకి చేరుకున్నారు. 'ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వరు.. ప్రజల గొంతు వినిపించనివ్వరు.. ప్రతిపక్ష హోదా ఇవ్వరు.. రైతు సమస్యలు వినిపించనివ్వరు.. కుప్పకూలిన శాంతి భద్రతలపై నిలదీయనివ్వరు' అనే నినాదంతో కూడిన బ్యానర్లతో పాటు ప్ల కార్డులను ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ నాలుగో నంబర్ గేటు ద్వారా సభ్యులు సభలోకి వచ్చారు. 'ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వరు.. కుప్పకూలిన శాంతి భద్రతలపై నిలదీయనివ్వరు' అనే ప్లకార్డును వైఎస్ జగన్ స్వయంగా పట్టుకుని లోపలకు ప్రవేశించారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు... ఎగ్జిట్ పోల్స్

తెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80-85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి. వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400-1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745-793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358-399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది.

# భరతమాతనే... అమెరికాకు అమ్మేశారు

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కారును విపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఒప్పందం పేరిట మన తల్లి భరతమాతనే అమెరికాకు అమ్మేశారంటూ నిప్పులు చెరిగారు. "వ్యవసాయం, ఇంధనంతో సహా అన్ని రంగాలనూ అమెరికా చేతికి అప్పగించేశారు. ఆ దేశానికి పూర్తిస్థాయి లొంగిపోయారు. దేశాన్ని ఇలా అడ్డంగా అమ్మేసినందుకు మీకు కనీసం సిగ్గుగా అనిపించడం లేదా?"అంటూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ ప్రసంగించారు. అమెరికాతో ఏకపక్ష ఒప్పందాన్ని మోదీ సర్కారు ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. "పలు విషయాలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా నేరుగా విపరీతమైన ఒత్తిడి పెట్టింది. పూర్తిగా ఆయన మెడలు వంచి నొక్కిపట్టింది. అందుకే దేశాన్ని మోదీ అమెరికాకు అమ్మేశారు. కేవలం అధికారం కాపాడుకోవడానికి జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టారు. లేదంటే ఇలాంటి ఏకపక్ష ఒప్పందానికి ఆయనే కాదు, ఏ భారత ప్రధానీ అంగీకరించబోడు"అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. "మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థి మెడను దొరకబుచ్చుకున్నాక దాన్ని గట్టిగా నొక్కిపడతారు. దాంతో అతను అల్లాడిపోతాడు. లొంగిపోయానంటూ చేతులెత్తేస్తాడు. మోదీ చేసింది సరిగ్గా అదే"అంటూ ఎద్దేవా చేశారు. "వాణిజ్య ఒప్పందం ద్వారా మన రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం పూర్తిగా రాజీ పడింది. జౌళి రంగాన్ని నేలమట్టం చేశారు. మన డేటాను, రైతులను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను, మన శక్తియుక్తులను, చిన్న, మధ్యతరహా వ్యాపారాలనూ అమ్మేశారు. ఇంధన



భద్రతను గాలికొదిలేశారు. ఇకపై మనం ఎవరి నుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించేది అమెరికాయే తప్ప మన ప్రధాని కాదు! పైగా ఆ కొనుగోళ్లను అగ్ర రాజ్యమే నిత్యం పర్యవేక్షిస్తుంటుంది. వారు చెప్పిన వాళ్ల దగ్గర కొనకపోతే మనపై మళ్లీ 50 శాతం టారిఫ్‌లు బాదుతారు. మన ఆర్థిక, ఇంధన రంగాలను మనపైకే ఆయుధాలుగా గురి పెట్టేందుకు అమెరికాను కేంద్రం అనుమతించింది"అంటూ నిప్పులు చెరిగారు. వాణిజ్య ఒప్పందం పేరుతో మోదీ సర్కారు అమెరికాకు దాసోహమన్న తీరు చాలా విషాదకరమని రాహుల్ అన్నారు. "మోదీ కేవలం తాను మాత్రమే లొంగిపోలేదు. 150 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తునే అమెరికాకు అప్పగించేశారు. అధికార బీజేపీ ఆర్థిక ఆయువుపట్లలో ఒకరిపై అమెరికాలో కేసు నడుస్తుండటమే ఇందుకు కారణం. సొంత పార్టీ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికే దేశాన్ని అగ్ర రాజ్యానికి మోదీ అమ్మకం పెట్టారు"అంటూ రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "డిజిటల్ వాణిజ్య నిబంధనలపై నియంత్రణను కేంద్రం పూర్తిగా అమెరికాకు వదిలేసుకుంది. డేటా లోకలైజేషన్‌ను తొలగించేసింది. అమెరికా నుంచి డేటా వరదకు గేట్లెత్తేందుకు ఒప్పుకుంది. బడా టెక్ కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేలు ప్రకటించేసింది. మొదట్లో మనపై కేవలం 3 శాతంగా ఉండే అమెరికా టారిఫ్‌లు ఇప్పుడు 18 శాతానికి పెరిగాయి. అమెరికా వస్తూత్పత్తులపై భారత టారిఫ్‌లు మాత్రం 16 శాతం నుంచి ఎకాయెకి సున్నాకు పడిపోయాయి. అమెరికా దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 146 బిలియన్ డాలర్లకు పెరగనున్నాయి"అంటూ రాహుల్ మండిపడ్డారు. "కేంద్రం మన వ్యవసాయ రంగాన్ని అమెరికాకు బార్లా తెరిచేసింది. దాంతో అక్కడి వ్యవసాయోత్పత్తులు మన మార్కెట్లను ముంచెత్తనున్నాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా మన రైతులు భారీ సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు. మోదీకి ముందు ఏ ప్రధానీ ఇలాంటి సిగ్గుచేటైన పని చేయలేదు. ఇకముందు మరే ప్రధానీ చేయబోడు"అన్నారు. అధికార పక్ష సభ్యులు పదేపదే లేచి రాహుల్ ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. చేతనైతే వాటికి రుజువులు చూపాలని సవాలు చేయగా అందుకు తాను సిద్ధమేనని రాహుల్ బదులిచ్చారు.

# రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. "గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. "2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ూణూ) గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని 'సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన'దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# పురపోరులో సత్తా చాటుతాం

న్యూఢిల్లీ: రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. బుధవారం ఢిల్లీ వచ్చిన ఆయన నేరుగా తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార?టకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది. ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసుకోవాలని, నేతల మధ్య విభేదాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని రేవంత్‌కు ఖర్గే హితబోధ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. ఒకవైపు బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఖర్గే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి సబంధించిన పలు అంశాలపై పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషిని కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ భేటీ కానున్నట్లు సమాచారం.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే



దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

**కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## కౌంటింగ్ హాలులోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు నిషేధం

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కౌంటింగ్ హాళ్లలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు సహా ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినట్లు ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లు సహా ఎవరూ ఈ నిబంధనలను ఉల్లంఘించరాదని ఆదేశించారు. భద్రతా తనిఖీలు నిర్వహించిన అనంతరం మాత్రమే కౌంటింగ్ హాలులోకి అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై ఎన్నికల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న అదనపు కలెక్టర్

- ప్రజాస్వామ్యంలో ఓటే శక్తివంతమైన ఆయుధం: భాస్కర్ రావు




**భువనగిరి, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి రాయగిరి పట్టణంలోని 3వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. స్థానిక స్వపరిపాలన వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

- ఖో ఖో లో ద్వితీయ బహుమతి సాధించిన లోతుకుంట మోడల్ స్కూల్ జట్టు

**వలిగొండ, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** భువనగిరి జిల్లా పరిధిలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖో ఖో విభాగంలో పోటీపడిన మోడల్ స్కూల్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుని ప్రశంసలు అందుకుంది. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో లోకేష్ కుమార్, ప్రశాంత్ కుమార్, నిఖిల్, యశ్వంత్ చారి రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి. ఐలయ్య బుధవారం తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, మండల విద్యాధికారి ఎస్. భాస్కర్, ఎస్సై యుగంధర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రయిసున్నీస బేగం, గ్రామ సర్పంచ్ గండు రాములుతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

## 14.600 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

**కొత్తగూడెం , (తొలివెలుగు):** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 14.600 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కూనవరం రోడ్డులోని ఆర్‌టీఓ కార్యాలయం ఎదురుగా వాహనాల తనిఖీలు చేపట్టిన అధికారులు, అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఒక కారు, ఒక స్కూటీని ఆపి తనిఖీ చేశారు. టీఎస్ 10 ఈయు 0558 నంబర్ గల బాలెనో కారు, హోండా యాక్టివా స్కూటీపై ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. విచారణలో ఈ మత్తు పదార్థాన్ని ఒడిశా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతం నుంచి సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో సూర్యాపేట జిల్లా ఫణిగిరి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్, మహమ్మద్ ఇఫ్తాకర్, సికింద్రాబాద్‌కు చెందిన నీర్ల అంజన్ కుమార్, తోటపల్లి గోపి, తోటపల్లి దిశ్వంత్ రెడ్డి అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు ఒక కారు, ఒక స్కూటీ, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.11 లక్షల 5 వేల రూపాయలు ఉంటుందని ఎక్సైజ్ ఎస్సై శ్రీహరి రావు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎ. కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, వీరబాబు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో ప్రశాంతంగా పోలింగ్



- 91.8 శాతం పోలింగ్ నమోదు
- రికార్డు స్థాయి ఓటింగ్
- భారీ బందోబస్తు మధ్య విజయవంతమైన పోలింగ్
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 20 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవం కాగా, మిగిలిన 19 వార్డుల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. మొత్తం 25,801 మంది ఓటర్లు ఉండగా, అందులో 12,838 మంది పురుషులు, 12,963 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ సమయంలో ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాలు సందడిగా మారాయి. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు 144 సెక్షన్ అమలు చేసి, భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా సాగిందని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్వయంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సరళి, వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను పరిశీలించారు. ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. మొత్తం 23,713 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సరికి చౌటుప్పల్‌లో 91.8 శాతం పోలింగ్ నమోదైంది. ఇది రికార్డు స్థాయి ఓటింగ్‌గా అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా, ప్రశాంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో వీరబాయి, ఎంఈఓ గురువారావు, పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.








## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

- హుజూర్‌నగర్‌లో 82.88 శాతం పోలింగ్ నమోదు
- పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ నర్సింహ



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. పట్టణంలోని 27 వార్డులకు గాను ఏర్పాటు చేసిన 54 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 28,867 మంది ఓటర్లు ఉండగా, అందులో 13,716 మంది పురుషులు, 15,143 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు 144 సెక్షన్ అమలు చేసి, కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ సమయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. జిల్లా ఎస్పీ నర్సింహ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల అధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. మొత్తం 23,926 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సరికి హుజూర్‌నగర్‌లో 82.88 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం మీద హుజూర్‌నగర్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగిశాయి. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమండరాజు, ఎస్ఐ మోహన్‌బాబు, పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## పాల్వంచ పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

- స్టేషన్ ఆవరణ లో బైఠాయించిన ఎం ఎల్ ఏ
- స్టేషన్ ను ముట్టడించిన ఎమ్మెల్యే, సిపిఐ శ్రేణులు

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, (తొలివెలుగు):** పట్టణ పరిధి లోని పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇందుకు సంబందించిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా ఒక మహిళ దొంగ ఓటు వేశారని ఆరోపిస్తూ, అ మహిళను పోలీసులు, పోలీస్ స్టేషన్ కు తరలించారు. అయితే గంటల తరబడి స్టేషన్ లో అట్టి మహిళ ను నిర్బంధించిన విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా స్థానిక సీఐ సతీష్ ను ప్రశ్నించడం తో అతని పట్ల సీఐ సతీష్ దురుసుగా ప్రవర్తించారన్న, విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ శ్రేణుల తో కలిసి స్టేషన్ ను ముట్టడించారు. తమ పార్టీ నాయకుడితో దురుసు గా ప్రవర్తించిన సిఐ సతీష్ క్షమాపణ చెప్పే వరకు కదిలేది లేదని పేర్కొంటూ ఎమ్మెల్యే స్టేషన్ ఆవరణ లోనే బైఠాయించారు. డిఎస్పి సతీష్ కుమార్ హుటాహుటిన స్టేషన్ కు చేరుకొని ఎం ఎల్ ఏ కూనంనేని తో చర్చలు జరుపు తున్నారు. ఎట్టకేలకు సీఐ తరుపున డిఎస్పి సర్ది చెప్పడంతో ఘర్షణ వాతావరణం సద్దు మణిగినట్లు అయింది





## తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

**గట్టుప్పల్, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. బుధవారం ఆయన తన స్వగ్రామమైన తేరట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్ది, కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తామని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలను అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం స్టేజ్ నిర్మాణం, క్రికెట్, ఖో–ఖో క్రీడా సామగ్రి, స్పోర్ట్స్ కిట్లు, డ్రెస్సులు, షూస్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ ఏర్పాటు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక టాయిలెట్స్ నిర్మిస్తామని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన గార్డెన్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ తెలిపారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





## పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు

- మంత్రి వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల, 11, ఫిబ్రవరి (తొలివెలుగు):** ప్రజాపాలన ప్రభుత్వంలో ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని కార్మిక అండ్ మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీలోని 227వ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు తమ నివాసం నుంచి నడుచుకుంటూ వెళ్లి ఓటు వేయడం స్థానికుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఓటు అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి, ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ప్రజాపాలనలో సామాన్య ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత పాలనలో ఎక్కడా పోలీసు ఒత్తిడి లేదని పేర్కొన్న మంత్రి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులను ఉపయోగించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపి ంచారు. అప్పట్లో ప్రజాస్వామ్యాన్ని హరించి, ఎన్నికలు నిర్వహించకుండా బెదిరింపులకు పాల్పడి ఏకగ్రీవాలు చేయించిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. అయితే ప్రజాపాలన ప్రభుత్వంలో ఎలాంటి బెదిరింపులు లేకుండా, పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించ బడుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభిమానం కాంగ్రెస్ పార్టీ వైపే ఉందని పేర్కొన్న మంత్రి, 85 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చివరగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి (తొలివెలుగు):** ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం మరియు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడంలో కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్లు, ఇన్‌చార్జ్జిలు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలకు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో, సమన్వయంతో పని చేసి ప్రజల్లో పార్టీ విధానాలను విస్తృతంగా చాటిచెప్పారని పేర్కొన్నారు. ప్రచారం నుంచి పోలింగ్ దశ వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించారని కొనియాడారు. ప్రత్యేకంగా నియమితులైన అభ్యర్వర్లు, ఇన్‌చార్జ్జిలు, మండల స్థాయి నాయకులు బూత్ స్థాయి వరకు పర్యవేక్షణ నిర్వహించి ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించారని తెలిపారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆమె అభినందనలు తెలియజేశారు. ప్రజాస్వామ్య పండుగైన ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన ఓటర్లకు, ఎన్నికల అధికారులకు, పోలీసు సిబ్బందికి కూడా సుగుణక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహం, ఐక్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ గౌడు, కిషన్ గౌడ్, సోమ శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పస్తం పోసం, గుండా శ్యాం, సేవాదళ్ విలాష్, సుజిత్ ఖాన్, అడపా పుస్సన్న, గుండా రవీందర్, అబ్దుల్లా, షేక్ మహ్మద్, సుజయ్, విశ్వనాథ్ తదితరులు, యువ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా:ఎస్పీ



**ఆసిఫాబాద్, (తొలివెలుగు):** ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తిస్థాయిలో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. బుధవారం ఉదయం నుంచే కాగజ్‌నగర్ పట్టణంలోని అన్ని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ నితికా పంత్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లను ఎఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొని, పటిష్ఠమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, విజయవంతంగా ఎన్నికలు ముగించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.మొత్తం ఎన్నికల నిర్వహణలో భాగంగా సుమారు 800 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించారని పేర్కొన్నారు. అదేవిధంగా 9 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 10 రూట్ మొబైల్ వాహనాలు నిరంతరం పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాయని తెలిపారు.

# హరిత హారంలో ఓటు 'ముద్ర'

- కొత్త ఓటర్లకు స్వాగతం.. అవ్వాతాతలకు గౌరవం
- గ్రీన్ మోడల్ కేంద్రాల్లో ఓటు వేసిన ఓటర్లు
- కలెక్టర్ పర్యవేక్షణలో ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్
- మోడల్ కేంద్రాల్లో ప్లాస్టిక్ రహిత అలంకరణ
- ఆదర్శ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హనుమంతరావు
- వయోవృద్ధులు, దివ్యాంగులకు సన్మానం




**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 11 (తొలివెలుగు):** జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు స్వయంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాల్లో కొత్త ఓటర్లకు స్వాగతం పలుకుతూ, వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లను ప్రత్యేకంగా సన్మానించడం విశేషంగా నిలిచింది. పోలింగ్ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం, భువనగిరి బీచ్ మహల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లి, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పచ్చని మొక్కలు, పూల అలంకరణలు, కొబ్బరి తోరణాలు, ప్లాస్టిక్ రహిత సామాగ్రితో పర్యావరణహితంగా అలంకరించడం ద్వారా ఓటర్లకు ప్రత్యేక అనుభూతిని కల్పించినట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా, ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. ఓటర్లకు తాగునీరు, నీడ, ర్యాంపులు, వీల్‌చైర్‌లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పోలింగ్ సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.










# జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 11, ఫిబ్రవరి (తొలివెలుగు):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ థమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల అల్ఫోన్జా ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ క్రమంలో అర్హులైన ఓటర్లు నిర్ణీత సమయంలోగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటు మూసివేసి, లోపల ఉన్నవారికి ఓటు హక్కు నియోగించుకు నేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు,



లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.



# నేడే బంగ్లాదేశ్ ఎన్నికలు

ఢాకా: కల్లోల బంగ్లాదేశ్‌లో అత్యంత కీలకమైన పార్లమెంట్ ఎన్నికలు గురువారం జరగబోతున్నాయి. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దాదాపు పది లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరిస్తున్నారు. దేశంలో ఇటీవలి కాలంలో హిందువులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. పలువురు హత్యకు గురయ్యారు. అందుకే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత 18 నెలలుగా మొహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం కొనసాగుతోంది. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావాలని బంగ్లాదేశ్ ప్రజలతోపాటు ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికలను ఆసక్తిగా గమనిస్తున్నాయి. గురువారం 13వ పార్లమెంటరీ ఎన్నికలతోపాటు 84 సూత్రాల సంస్కరణ ప్యాకేజీపై ప్రజాభిప్రాయ సేకరణ(రిఫరెండం) కూడా జరుగబోతోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ), ఒకప్పటి దాని మిత్రపక్షం జమాత్--ఇ--ఇస్లామీ మధ్య పోటీ నెలకొంది. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా మొహమ్మద్ యూనస్ మధ్యంతర ప్రభుత్వం గత ఏడాది నిషేధం విధించింది. దాంతో ఈ ఎన్నికల్లో అవామీ లీగ్ పోటీలో లేకుండాపోయింది. మొత్తం 300 పార్లమెంటరీ నియోజకవర్గాలకు గాను 299 నియోజకవర్గాల్లో ఉదయం 7.30 గంటలకు బ్యాలెట్ విధానంలో పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4.30 గంటల దాకా కొనసాగుతుంది. ఒక నియోజకవర్గంలో అభ్యర్థి మృతిచెందడంలో అక్కడ ఎన్నికలు రద్దుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 రాజకీయ పార?టల నుంచి 1,755 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. అలాగే 273 మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీ చేస్తున్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ 291 మందిని బరిలోకి దించింది. వీరిలో 83 మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 42,659 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 12.77 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3.58 శాతం మంది తొలిసారి ఓటర్లుగా నమోదైనవారే కావడం విశేషం. విదేశాల్లో ఉన్న 8 లక్షల మంది ప్రవాస బంగ్లాదేశీయులు కూడా ఓటు హక్కు వినియోగించుకోబోతోన్నారు. వారికోసం ఐటీ ఆధారిత పోస్టల్ బ్యాలెట్ విధానం తీసుకొచ్చారు. పార్లమెంట్‌లో మొత్తం 350 స్థానాలున్నాయి. ఇందులో 300 స్థానాలకు ప్రత్యక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మిగతా 50 స్థానాలను మహిళలకు రిజర్వ్ చేశారు. పార్లమెంట్ పదవీ కాలం ఐదేళ్లు. ఈ ఎన్నికలను రాజకీయ సంస్కరణలకు రిఫరెండంగా భావిస్తున్నారు. అవామీ లీగ్ పోటీలో లేకపోవడం బంగ్లాదేశ్ నేషనలిస్టు పార?టకి అనుకూలంగా మారింది. పోటీలో ఉన్న అతిపెద్ద పార్టీ అదొక్కటే కావడం గమనార్హం. దివంగత ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మ?మన్ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. ఎన్నికల్లో ఆ పార్టీ గెలిస్తే ఆయన ప్రభుత్వ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది. బీఎన్‌పీకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# స్కూల్‌లో చొరబడి విద్యార్థులు, టీచర్ల నిర్బంధం

థాయిలాండ్‌లో ఓ ఆగంతకుని దుశ్చర్య

హాట్ యాయ్: పట్టరాని ఆగ్రహంతో ఊగిపోతున్న ఓ ఆగంతకుడు సమీప స్కూల్‌లోకి చొరబడి గన్‌తో అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులను బెదిరించి అందర్నీ బంధించిన ఉదంతం థాయిలాండ్‌లో జరిగింది. విషయం తెల్సి రంగంలోకి దిగిన పోలీసులు దాదాపు రెండు గంటలపాటు శ్రమించి ఎలాగోలా అందర్నీ క్షేమంగా విడుదలచేశారు. అయితే ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒక విద్యార్థి గాయపడ్డాడు. రెండు గంటలపాటు తీవ్ర ఉత్కంఠకు గురిచేసిన ఈ ఘటన ఎట్టకేలకు సుఖాంతంకావడంతో పోలీసులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. దక్షిణ థాయిలాండ్‌లోని హాట్ యాయ్ జిల్లాలోని సోంగ్‌ఖ్లా పట్టణంలోని ఫటోంగ్ ప్రథాన్ ఖిరివాట్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. రెండు గంటలపాటు అందర్నీ తన బందీలుగా మార్చుకున్న 19 ఏళ్ల ఆగంతకుడిని ఖేమ్నన్‌గా పోలీసులు గుర్తించారు. స్కూల్‌లో తన సోదరికి పాఠాలు చెప్పిన ఒక టీచర్‌ను లక్ష్యంగా చేసుకుని పాఠశాలలోకి ఖేమ్నన్ చొరబడ్డాడని స్థానికులు ఆరోపించారు. ఖేమ్నన్‌కు పాఠశాలకు మధ్య నెలకొన్న వివాదం ఏమిటన్నది తెలియరాలేదు. స్కూల్లో పలుమార్లు కాల్పుల శబ్దాలు విన్పించాయని, పలువురు గాయపడ్డారని తొలుత వచ్చిన వార్తలను థాయిలాండ్ ప్రభుత్వం ఖండించింది. థాయిలాండ్‌లో తుపాకీల సంస్కృతి ఎప్పట్నుంచో ఉంది. ఇక్కడి జనాభాలో చాలా మందికి గన్‌లను కొనుగోలుచేసే అలవాటు ఉంది. వ్యక్తిగత మనస్పర్ధలతో తుపాకీల మోతలు మోగుతాయిగానీ గుమిగూడిన జనాలపై సామూహికంగా కాల్పుల ఘటనలు అత్యంత అరుదు.



# గగన్‌యాన్‌పై ముమ్ముందుకే..




బెంగళూరు: మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో ఎన్ని అవరోధాలు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే భారత్ ముమ్ముందుకే దూసుకెళ్లాలని గ్రూప్ కెప్టెన్, భారత వ్యోమగా మి, అశోక చక్ర అవార్డు గ్రహీత శుభాంశు శుక్లా అన్నారు. చిరకాల ఆకాంక్ష నెరవేర్చుకోవాలని చెప్పారు. సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ ఉత్సాహంతో పనిచేస్తే అనుకున్నది సాధించడం తథ్యమని పేర్కొన్నారు. ఆయన బుధవారం బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లా డారు. మిషన్ గగన్‌యాన్ విజయవంతం అయి తే ఇలాంటి ఘనత సాధించిన దేశాల జాబితా లో భారత్ చేరుతుందని తెలిపారు. మనదేశ కీర్తిప్రతిష్టలు మరింత పెరుగుతాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కేవలం మూడు దేశాలు మాత్రమే మానవసహిత అంతరిక్ష యాత్రల్లో విజయవంతం అయ్యాయని గుర్తుచేశారు. గగనయాన్ యాత్ర ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. ఇదే మనదేశంలో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర. ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి, మూడు రోజుల్లో క్షేమంగా వెనక్కి తీసుకురావాలన్నది గగన్‌యాన్ లక్ష్యం. 2027లో ఈ యాత్రను చేపట్టాలని నిర్ణయించినట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వెల్లడించింది. శుభాంశు శుక్లా ఇప్పటికే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లొచ్చారు. గగన్‌యాన్ కోసం శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములను ఇస్రో ఎంపిక చేసింది. గగన్‌యాన్ సాధారణమైన మిషన్ కాదని శుక్లా పేర్కొన్నారు. ఇది అత్యంత సంక్లిష్ట మైన, సవాళ్లతో కూడుకున్న కార్యక్రమమని వివరించారు. అయినప్పటికీ అధైర్యపడే ప్ర సక్తే లేదన్నారు. మొదటి రోజు ఎంత ఉత్సా హంతో ఉన్నామో ఇప్పటికీ అదే ఉత్సాహంతో పని చేస్తున్నామని స్పష్టంచేశారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి, మళ్లీ భూమిపైకి తీసుకురావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ష్టాత్మకంగా భావిస్తున్నామని తెలిపారు. పెద్ద కార్యక్రమంలో కొన్ని అవరోధాలు, ఆలస్యా లు సహజమేనని వ్యాఖ్యానించారు. వాటిని ప్రతికూలతలుగా చూడొద్దని పేర్కొన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. అంతరిక్ష ప్రయోగాల్లో వేర్వేరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని శుక్లా తెలిపారు. ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం కలిసి పనిచేయడంలో తప్పులేద న్నారు. తాను ఐఎస్ఎస్‌కు వెళ్లిరావడానికి అమెరికా కూడా సహకరించిందని గుర్తుచేశా రు. మన దేశంలో అంతరిక్ష కేంద్ర ప్రభుత్వం చక్కటి సహకారం అందిస్తోందని వివరించారు. సైన్స్, అంతరిక్ష ప్రయోగాల్లో పెట్టుబడులు నానాటికీ పెరుగుతుండడం శుభ పరిణామం అని చెప్పారు. గగన్‌యాన్ కోసం అందరూ ఓపిగ్గా ఎదురు చూడాలని యా త్రకు ఎంపికైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ పేర్కొన్నారు. ఏది జరగాలో అది కచ్చితంగా జరుగుతుందన్నారు. గగన్‌యాన్ యాత్ర విజయవంతమైతే ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు కెక్కుతుందని స్పష్టంచేశారు.

# దేశాన్ని అమ్మింది కాంగ్రెసే



న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందం పేరిట దేశాన్ని మోదీ సర్కారు అమెరికాకు అమ్మేసిందన్న విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. "దేశ ప్రయోజనాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వంటి అంతర్జాతీయ సంస్థలకు తాకట్టు పెట్టింది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమే. పేదలు, రైతుల ప్రయోజనాలను వాటికి అమ్మేసింది. ఏకంగా దేశాన్నే అమ్మేసింది"అంటూ దుయ్యబట్టారు. కంద్రంలో అధికారంలో ఉండగా షెర్మెల్ షేక్ చర్చల సందర్భంగా దేశాన్ని దాయాది పాకిస్తాన్‌కు తనఖా పెట్టిన, ఏకంగా మన సార్వబౌమత్వం విషయంలో రాజీ పడ్డ చరిత్ర కూడా కాంగ్రెస్‌దేనని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ 2026--27పై లోక్‌సభలో జరిగిన చర్చకు నిర్మల బుధవారం సాయంత్రం బదులిచ్చారు. మన దేశాన్ని అమ్మగల, కొనగల వాడెవరూ పుట్టలేదంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను ఆమె పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ అలాంటి పని ఎప్పటికీ చేయబోరని స్పష్టం చేశారు. ఇంధన, ఆర్థిక, ఆహార, డేటా భద్రత తదితరాలపై రాహుల్ లేవనెత్తిన ఆందోళనలను కొట్టిపారేశారు. ఆ విషయాల్లో అవసరమైన అన్ని చర్యలూ కేంద్రం తీసుకుందని, బడ్జెట్‌లో వాటికి చాలినన్ని నిధులు కేటాయించిందని చెప్పారు. సంబంధిత గణాంకాలను సభకు చదివి వినిపించారు. రాహుల్ అసలు బడ్జెట్‌నే చదవకుండా నిరాధార ఆరోపణలకు దిగారని మండిపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేసినట్టు నిర్మల సభకు తెలిపారు. "మా ప్రభుత్వం కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 4.3 శాతానికి పరిమితం కావచ్చు"అని అంచనా వేశారు. దేశంలో ఎరువుల కొరత ఉందన్న వార్తలను కొట్టిపారేశారు. వాటి దిగుమతికి బడ్జెట్లో ఏకంగా రూ.1.71 లక్షల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్లో పశి?చమబెంగాల్‌కు కేటాయింపులే లేవన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను నిర్మల తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ ఏలుబడిలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా మంటగలిశాయంటూ మమతా బెనర్జీ సర్కారు పనితీరును దుయ్యబట్టారు. బెంగాల్లో ఎక్కడ చూసినా బాంబుల సంస్కృతే రాజ్యమేలుతోందని ఆరోపించారు. 'బెంగాల్లో బాంబులే మాట్లాడతాయి, చట్టాలు కాదు'అంటూ పలు ఉదంతాలను ఉటంకించారు. దాంతో విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాలు, స్టేషనరీ, విద్యపై జీఎస్టీ వసూలు చేస్తున్నారన్న తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు అభిక్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలను నిర్మల తీవ్రంగా ఖండించారు. "వాస్తవాలను ఆయన ఉద్దేశపూర్వకంగా పూర్తిగా వక్రీకరించారు. పెన్సిళ్లు, షార్పనర్లపైనా జీఎస్టీ వేశామట! మరీ ఈ స్థాయిలో అబద్ధాలా? 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన నాటి నుంచీ పాలపై ఎన్నడూ జీఎస్టీ విధించలేదు. చావుపైనా జీఎస్టీ వేశారని పచ్చి అబద్ధాలు చెప్పారు. అంతిమక్రియలపై కూడా ఎప్పుడూ జీఎస్టీ లేదు. వింటున్న సభ్యులకు తెలివి లేదని అభిక్ భావిస్తున్నారా?"అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. బహుశా పశ్చిమబెంగాల్లో నడుస్తున్న సిండికేట్ మరణాలపైనా పన్నులు వసూలు చేస్తోందేమో అంటూ అధికార తృణమూల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. అన్యాయానికి గురయ్యామంటూ సానుభూతి కార్డు వాడటం, ప్రతిదానికీ సుప్రీంకోర్టు దగ్గరికి పరుగెత్తడం, చివరికి కోర్టుతో చీవాట్లు తినడం తృణమూల్‌కు అలవాటుగా మారిందన్నారు.

## ఇండో పాక్ సరిహద్దుల్లో ఖాళీ సీసాలు, ఎందుకో తెలుసా?

భారతదేశ సరిహద్దుల గురించి మనం ఆలోచించినప్పుడు, సాధారణంగా గుర్తుకు వచ్చేది ముళ్ల తీగల కంచె. సినిమాలు, టీవీలలో ఈ దృశ్యాలనే చూస్తాం. కానీ కాస్త నిశితంగా పరిశీలిస్తే కంచె వెంట వేలాడుతున్న గాజు సీసాలుకూడా కనిపిస్తాయి. ఇవి ఎందుకు పెడతారు? వాటి వలన ప్రయోజనం ఏమిటి? తెలుసు కుందాం. నిజానికి ఇవి చూడటానికి సాధారణంగా కనిపించవచ్చు. కానీ అవి దేశాన్ని రక్షించడంలో కీలకమైన ప్రయోజనాన్ని అందిస్తాయి. సరిహద్దు గార్డులకు 'స్థానిక హెచ్చరిక'గా పనిచేస్తుంది, తరచుగా వారి ప్రాణాలను రక్షించడంలో సహాయపడుతుంది. సరిహద్దు భద్రతా దళం (దీూఫ్) అనుసరించే అత్యంత ప్రభావవంతమైన 'లో-టెక్' భద్రతా పద్ధతుల్లో ఇది ఒకటి. సరిహద్దులో దట్టమైన పొగమంచు కురిసినప్పుడు లేదా పిచ్ చీకటిగా ఉన్నప్పుడు, అత్యాధునిక కెమెరాలు కూడా కొన్నిసార్లు పనిచేయకపోవచ్చు. అటువంటి సమయంలో, ఎవరైనా సరిహద్దు కంచెను కత్తిరించడానికి లేదా దాటడానికి ప్రయత్నిస్తే, ఆ కంచెకు ఉన్న గాజు సీసాలు ఒకదానికొకటి తగిలి శబ్దాన్ని చేస్తాయి. ఈ శబ్దం ద్వారా అలర్ట్ అయిన సైనికులు చొరబాటుదారులను వెంటనే పట్టుకుంటారు.

### పొగమంచు సమయాల్లో రక్షణ

ముఖ్యంగా పంజాబ్, జమ్మూ ప్రాంతాల్లో చలికాలంలో పొగమంచు (ఫీశీస్త్ర) చాలా ఎక్కువగా ఉంటుంది. కంటికి ఎదురుగా ఉన్న మనిషి కూడా కనిపించని ఆ సమయంలో, ఈ సీసాలు 'అలారం'లా పనిచేస్తాయి. శత్రువు కంచెను తాకిన వెంటనే వచ్చే "కిణ కిణ" శబ్దమే సైనికులకు సిగ్నల్. థర్మల్ ఇమేజర్లు, సెన్సార్లు వంటి ఖరీదైన పరికరాలు లేని చోట లేదా అవి మొరాయించినప్పుడు, ఈ ఖాళీ సీసాలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటికి మెయింటెనెన్స్ అవసరం లేదు, విద్యుత్ అవసరం లేదు. కేవలం గాలికి ఊగకుండా, ఎవరైనా తాకితేనే శబ్దం వచ్చేలా వీటిని అమర్చుతారు. ఈ సీసాలను సాధారణంగా శీతల పానీయాల (ాశీట్ ఔతీఱఅఎం) ఖాళీ బాటిల్స్‌ను సేకరించి ఉపయోగిస్తారు. కేవలం శబ్దమే కాదు, రాత్రిపూట టార్చ్ లైట్ వేసినప్పుడు ఈ గాజు సీసాలు కాంతిని పరావర్తనం (=వటశ్రీవష్ఱశీఅ) చెందిస్తాయి, ఇది కూడా భద్రతకు అదనపు బలాన్నిస్తుంది. చాలా దేశాల సరిహద్దుల్లో అత్యాధునిక సెన్సార్లు ఉన్నప్పటికీ, మన జవాన్లు ఇప్పటికీ ఈ సంప్రదాయ పద్ధతిని నమ్ముతారు ఎందుకంటే ఇది ఎప్పుడూ ఫెయిల్ అవ్వదు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





## భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్

బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,'ధురంధర్'అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను 'ఉరి' దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బి-టౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.




## స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది.స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

## మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి: నవీన్

టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు.





## వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్

దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.



## రివాల్వార్ రీటాగా వచ్చిన కీర్తి సురేశ్

ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పుడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'. పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ.5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ.5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ.